షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 8 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

## మా అడ్డాకు వచ్చి అడ్డగోలుగా

# మాట్లాడొద్దు



- ఎడాదిలో 21కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర మా కాంగ్రెస్ పార్టీది
- దేశంలోనే మొదటి ఏడాదిలో 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చింది ఒక్క తెలంగాణలోనే
- అది నిరూపిస్తే.. ఢిల్లీ నడిబజార్‌లో క్షమాపణ చెబుతా.. సీఎం సంచలన వ్యాఖ్యలు
- ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదే
- మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష హోదా పోషించాడా?

నల్గొండ

నల్గొండ కాంగ్రెస్ విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీకి సవాల్ విసిరారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తాము ఇచ్చిన ఉద్యోగాలు ఎక్కడైనా ఇస్తే.. ఢిల్లీ నడిబజార్ లో వచ్చి క్షమాపణ చెబుతానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే మొదటి ఏడాదిలో 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చింది ఒక్క తెలంగాణలోనేనని అన్నారు. ఈ క్రమంలోనే మా అడ్డాకు వచ్చి అడ్డగోలుగా మాట్లాడొద్దని కేంద్ర మంత్రి నడ్డాను హెచ్చరించారు. ఎడాదిలో 21కోట్ల తో రెండు లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర మా కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఒక్క నల్గొండ జిల్లాలోనే - మిగతా3లో



## మోదీని చంపుతామంటూ బెదిరింపు మెసేజ్

- రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్టు గుర్తించాం
- నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాన్ని వెంటనే అక్కడికి పంపామని అధికారుల వెల్లడి
- ప్రధాని మోదీని టార్గెట్‌గా చేసుకుని ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు బాంబు పేలుడుకు పథకం వేసినట్టు ఆ మెసేజ్
- మెసేజ్ పంపిన వ్యక్తి మానసిక స్థిమితం కోల్పోవడం కానీ, మద్యం తాగిన మైకంలో కానీ ఉండవచ్చని అనుమానం

## 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు

# కేసీఆర్‌కు ఆహ్వానం



హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన జరిగే.. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బృందానికి మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంశీధర్ రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. తన నివాసానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లంచ్ ఆతిథ్యమిచ్చి కేసీఆర్ గౌరవించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నేతలు నెమరు వేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారుడు హర్కర వేణుగోపాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్రావు తదితరులున్నారు.



## అమిత్ షా ఎన్నికల్లో బిజీగా ఉన్నారు

- గ్యాంగ్‌స్టర్ల నియంత్రణలో ఢిల్లీ ఉంది
- 'ఢిల్లీలో శాంతిభద్రతల బాధ్యత అమిత్ షాపై ఉంది
- షూటర్లను అరెస్టు చేస్తున్నప్పటికీ వెనుక ఉన్న సూత్రధారులు ఇంకా పరారీలో ఉన్నారు'
- ఢిల్లీలో హత్యలపై అరవింద్ కేజ్రీవాల్ మండిపాటు


# మరో 15 ఏళ్లు కాంగ్రెస్సే

- తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- ఈ ఐదేళ్లు కాదు.. రానున్న మరో పదేళ్ల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది
- ఏడాది పాటు అద్భుతమైన పాలన అందించాం
- రానున్న సంవత్సరాలకు ప్రణాళిక సిద్ధమైంది
- లోకల్ బాడీ ఎన్నికల్లో 80 సీట్లు గెలుచుకుంటాం



హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంది. నేతలంతా విజయోత్సవాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. ఈ ఐదేళ్ళు కాదు.. రానున్న మరో పదేళ్ల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు.ప్రభుత్వం. ఏడాది పాటు అద్భుతమైన పాలన అందించామన్నారు. రానున్న సంవత్సరాలకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. వాటిని త్వరలో అమలు చేస్తామన్నారు. మా ప్రభుత్వానికి ఇప్పటికైతే ఐదుకి 4. 5 మార్కులు ప్రజలు ఇస్తున్నారని వివరించారు. ఈసారి గ్రేటర్‌లో కాంగ్రెస్‌దే హవా ఉండబోతోందన్నారు టీపీసీసీ. లోకల్ బాడీ ఎన్నికల్లో 80 సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ళు కాదు రానున్న 10 నుంచి 15 ఏళ్లు సుస్థిరంగా కాంగ్రెస్ పార్టీ - మిగతా3లో



## హిమాచల్‌ను వణికించిన వరుస భూకంపాలు

- స్వల్ప వ్యవధిలోనే మూడు సార్లు కంపించిన భూమి
- రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 3.3గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడి
- తెలంగాణ రాష్ట్రంలోనూ మరోసారి భూకంపం సంభవించింది.



## ప్రమాణ స్వీకారానికి మహారాష్ట్ర ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరాకరణ

- మాకు ఈవిఎంలపై అనుమానాలున్నాయి.
- ఎన్నికల్లో జరిగిన మోసానికి నిరసనగా మేము ఈ రోజు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం
- ప్రజాస్వామ్య వ్యవస్థ హత్య చేస్తున్నారు
- ఉద్ధవ్ శివసేన పార్టీకి చెందిన ఆదిత్య ఠాక్రే



## అధికారం మాత్రమే పోయింది

- బీఆర్ఎస్‌పై ప్రజల్లో అభిమానం ఏ మాత్రం తగ్గలేదు : కేటీఆర్
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ ప్రజలకు ఓపిక పట్టే గుణం ఉంది
- గాంధీ భవన్ బోసిపోతోంది తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోంది
- సూటిగా, సుత్తి లేకుండా సామాన్యుడికి అర్థమయ్యే విధంగా నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్‌లో స్పష్టంగా చెప్పారు.

# ఐడిపిఎల్ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు రక్తపు వాంతులు

షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి డిసెంబరు 07



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ లోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఉదయం 10 గంటల 30 నిమిషాలు సమయంలో తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. స్కూల్ బిల్డింగ్ 3 అంతస్తుల్లో 7,8 వ తరగతి క్లాస్ రూమ్ లో చదువుకుంటున్న సమయంలో క్లాస్ రూమ్ పక్కన గల బాత్రూం శుభ్రం చేస్తుండగా యాసిడ్ బాటిల్ కింద పడడంతో ఆ వాసనకు విద్యార్థులు రక్తపు వాంతులు చేసుకున్నారు. సుమారు 50 మందికి పైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనతో ఆందోళన చెందిన పాఠశాల యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా తల్లిదండ్రులకు సైతం సమాచారం ఇవ్వకుండా విద్యార్థులను చింతల్ లోని ప్రాణధార హాస్పిటల్ కు తరలించారు. కొందరు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంత ఇబ్బంది కలుగుతున్నా కనీసం సమాచారం ఇవ్వకపోగా జరిగిన విషయాన్ని దాచి పెట్టిన ప్రిన్సిపల్ ఏం కాలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సమయం ముగియక ముందే పిల్లలను ఇంటికి పంపడంతో కొందరి తల్లిదండ్రులకు ఏం జరిగిందో తెలియక అయోమయం అయ్యారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం



చేశారు. పాఠశాల ముందు ఆందోళన చేశారు. పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో మెరుగైన వైద్యం అందించి చిన్నారుల ప్రాణాలు కాపాడిన ప్రాణదార ఆసుపత్రి యాసిడ్ దుర్వాసనతో రక్తపు వాంతులు చేసుకుంటున్న చిన్నారులను అక్కడ ఎమర్జెన్సీ సిబ్బంది వైద్యులు సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పిందని సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది లేదని వైద్యులు తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలను

# ఆకస్మికంగా తనిఖీలు చేసిన ప్రణవ్




విద్యార్థుల్లో ధైర్యాన్ని,భరోసా నింపడానికే ఈ సందర్శన..
- నేరుగా పిల్లలతో మధ్యాహ్న భోజనం
- సౌకర్యాల విషయంలో పిల్లలకు ఏలాంటి ఇబ్బందులు ఉండొద్దు.
- కలిసి రండి,విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని బిఆర్ఎస్ నాయకులకు సూచన
- ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక

**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి డిసెంబరు 07:** గతంలో కంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల సౌకర్యాలు చేపడుతున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం హుజురాబాద్ నియోజకవర్గంలోని వీణ వంక సైదాపూర్ మండలాల పరిధిలో గల ఎంజెపిబిటి బాలుర పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వసతులపై ఆరాతీసి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. గతానికంటే భిన్నంగా విద్యార్థుల డైట్ విషయంలో అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామని,మధ్యాహ్న భోజన విషయంలో ఇంటిని మరిపించేలా మంచి పౌష్టికాహారాన్ని అందజేసేలా కృషి చేస్తున్నామని,పదేళ్లుగా పెరుగని డైట్,కాస్మోటిక్ చార్జులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 40 శాతం పెంచామని ఇది పేద విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు.సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై అవస్థవాలు మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయవద్దని ఇక్కడ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న వారు కూడా పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో భోజనం చేసిన తర్వాత సౌకర్యాలపై ఆరా తీయాలని సూచించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులతో ఇప్పటికే పలుమార్లు మాట్లాడామని నాణ్యత విషయంలో ఎక్కడా తగ్గకూడదని ఇప్పటికే పలు సూచనలు చేసినట్టు తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉండి కాంట్రాక్టర్ల సంబంధాలతో ప్రభుత్వం పై బురద చల్లె ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పాఠశాలలను సందర్శించినప్పుడు పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారని ఇది బీఆర్ఎస్ నాయకులు గమనించాలని కోరారు.



# సీసీఐ పత్తి కొనుగోళ్ళలో దోపిడిని అరికట్టాలి

గ్రామాల్లో పత్తి రైతులను మోసం చేస్తున్న దళారులను శిక్షించాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి డిసెంబరు 07:** రైతుల పత్తి కొనుగోళ్లలో అవకతవకలను అరికట్టి దోపిడిని నివారించి వాస్తవ సాగు దారులు పత్తిని సిసిఐ భేషరతుగా కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య ( ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వరంగల్ మార్కెటింగ్ ఉన్నతాధికారులు జేడీఎం, డీడియం డిఎంఓ ఏనుమాముల మార్కెట్ కార్యదర్శులను కలిసి సిసిఐ పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలపై రైతులకు జరుగుతున్న ఇబ్బందులు నష్టాలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ పత్తి రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రకృతి వైపరీత్యాలను దాటుకొని అరకొరగా పత్తిని పండిస్తే మద్దతు ధర కల్పించి ఆదుకోవాల్సిన సిసిఐ మార్కెటింగ్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. వాస్తవ సాగుదారులైన పత్తి రైతుల పంటను కుంటి సాకులతో కొనుగోలు చేయకుండా నిరాకరిస్తూ మధ్య దళారులు గ్రామాల్లో రైతులకు మాయ మాటలు చెప్పి అతి తక్కువ ధరకు తీసుకువచ్చిన పత్తిని మాత్రం తప్పుడు పద్ధతులలో కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇదంతా దళారులు వ్యాపారులు సిసిఐ అధికారుల కుమ్మక్కై చేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతుందని ఆరోపించారు. పత్తి రైతును అష్టదిగ్బంధనం చేసి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో బస్తాలలో తెచ్చిన పత్తిని కుంటి సాకులతో సీసీఐ నిరాకరించే పత్తిని ప్రైవేటు వ్యాపారులు అతి తక్కువ ధర కొనుగోలు చేసి అదే పత్తిని సిసిఐ కి అమ్ముతున్నారని ఇదంతా తెలిసినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పత్తి కొనుగోలు చేసే పత్తి మిల్లులలో పత్తి సెలక్షన్ల లో తూకంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని తక్షణమే అధికార యంత్రాంగం సిసిఐ కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ పెంచి రైతులకు జరుగుతున్న మోసాలను అరికట్టి దోపిడీకి పాల్పడుతున్న వ్యాపారులు మధ్య దళారులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు జరిగే నష్టాన్ని నివారించాలని కోరారు. అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోకపోతే రైతుల పక్షాన పత్తి కొనుగోలులో జరుగుతున్న దోపిడిని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుసుంబ బాబూరావు మహమ్మద్ ఇస్మాయిల్ ఏఐసిటియు జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్వర్ జిల్లా సహాయ కార్యదర్శి గోనె రామచందర్ జిల్లా నాయకులు ఐతమ్ నాగేష్ పరిమళ గోవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.




## మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రు అనిల్ కుమార్



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి డిసెంబరు 07** అడ్డ గూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రు అనిల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రు అనిల్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేద మధ్యతరగతి విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం కల్తీ జరగడం అనేక మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం జరిగిందని అన్నారు. అయినా కూడా ప్రభుత్వానికి ఏ మాత్రం చలనం లేకుండా పోయిందని అన్నారు. గత నాలుగు నెలలుగా మధ్యాహ్నం భోజనం వండే కార్మికులకు బిల్లులు ఇప్పటి వరకు చెల్లింక పోవడంతో ఆందోళన చెందే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు నెలల తరబడి బిల్లులు రాక పోతే ఎలా వండాలి అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెడింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## యాసంగి పంటకు పూర్తిగా సాగు నీరు ఇవ్వాలని ఎమ్మెల్యే మెఘా రెడ్డి నీ కోరిన శాఖ పూర్ వై గ్రామ రైతులు



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి డిసెంబరు 07:** పెబ్బేరు మండల శాఖ పూర్ రైతులు యాసంగి పంటకు నీరు విడుదల చేయాలని ఎమ్మెల్యే ను కోరగానే వెంటనే ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి యాసంగి పంట పూర్తయ్యే వరకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు అలాగే ప్రభుత్వం ఇస్తున్న 500 బోనస్ రైతుల అకౌంట్ లలో జమైన సందర్భంగా కావలి గోవిందు నాయుడు ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే మేఘా రెడ్డి ని క్యాంప్ ఆఫీస్ లో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు జక్కుల గోవింద్ ఎరుకలి శాంతాయ్య వెంకట శైలం పగుడాల మహానంది బలరాం గొల్ల బాలస్వామి గొల్ల రమేష్ వెంకటేష్ రెడ్డి బదుదాలి అడివన్న జక్కుల రవి జక్కుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీలను ప్రారంభించిన తక్కళ్ళపల్లి రవీందర్ రావు



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి డిసెంబరు 07:** నర్సంపేట నియోజకవర్గం ఖానా పురం మండలం అశోకనగర్ గ్రామలో సైనిక్ స్కూల్ ఆవరణంలో సీఎం కప్ క్రీడలను కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వరంగల్ డిసిసి అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి యువతలో ఉండే క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యమన్నారు. గెలుపు ఓటములు సహజమని గెలిచినా ఓడినా అధైర్యపడకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ ఓ సత్యవాణి ఎంపీడీఓ భారతి ఎంఈఓ శ్రీదేవి సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేందర్ ఎంపీఓ సునీల్ గ్రామ కార్యదర్శి జనార్ధన్ కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్ది శ్రీనివాస్ గౌడ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టి సారంగపాణి సొసైటీ డైరెక్టర్ జాడి అచ్యుత్ అయోధ్య నగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుండ్ల యాకన్న గ బీసీ సెల్ అధ్యక్షులు కదురు సారయ్య వ్యాయామ ఉపాధ్యాయులు యట రవికుమారు సుభద్ర బొంపల్లి అనిల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు జాడి వెంకటేష్ వాడపల్లి రాజు మక్కా వినోద్ నడిపల్లి భారత్ వాడపల్లి రాజు పీఈటీ లు కార్యకర్తలు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి డిసెంబర్ 07:** ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ప్రజలకు జరిగిన మోసాలపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో ధర్నా చేపట్టారు.అనంతరం నర్సంపేట పట్టణం లోని సిటిజన్ క్లబ్ ఆవరణలో జరిగిన బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పెద్ది మాట్లాడుతూ అంబేద్కర్ కు నివాళు లు అర్పించే స్వేచ్ఛ నర్సంపేట లో లేకుండా పోయిందన్నారు.గ్రామీణ స్థాయి నుంచి హైదరాబాద్ వరకు అరాచకాలు పెరిగి పోయాయన్నారు. బిఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉద్దేశ్య పూర్వకంగానే బిఆర్ఎస్ నాయకత్వం పై 41 పిఆర్సి నోటిసులు ఇవ్వకుండా కేసులు నమోదు చేసి జైల్లో పెట్టడం అన్యాయమని ఆయన ఆరోపించారు. బిఆర్ ఎస్ అధికారంలో ఉన్న ప్రతిపక్ష నాయకులు కార్యకర్తలపై అకారణంగా కేసులు పెట్టడం కానీ దాడులు చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో బిఆర్ఎస్ కార్యకర్తలు ఎండగట్టాలని పెద్ది పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా ఓసిడిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి రాయిడి రవీందర్ రెడ్డి నాగేల్లి వెంకట్ నారాయణ గౌడ్ లెక్కల విద్యా సాగర్ రెడ్డి మారం రాము మచ్చిక నర్సయ్య గౌడ్ ఊడ్గుల ప్రవీణ్ గౌడ్ బానోత్ సారంగపాణి బాల్నే వెంకట్ గౌడ్ మొగిలి సంఘని సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిరప పంట అధిక దిగుబడి నోవా అగ్రి గ్రూపు ఉత్పత్తులు చక్కని పరిష్కారం



**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి డిసెంబరు 07:** మిరుపలో వచ్చే అన్ని రకాల తెగుళ్లకు ఒకే ఒక్క చక్కని పరిష్కారం నోవా అగ్రి గ్రూప్ ఉత్పత్తి సూపర్ లావా 5 జి ప్లస్ తోనే సాధ్యం అని ఏరియా మేనేజర్ లునావత్ శ్రీను అన్నారు. శనివారం డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామం రైతు ప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలోని ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ లావా 5 జి ప్లస్ పనితనాన్ని రైతులకు వివరించారు ప్రస్తుతం ఉన్న వాతావరణానికి ఈ మందు వాడకంతో మిరప తోట ఇగురు లో పై ముడత,క్రింది ముడత, పురుగు తో పాటు ఇతర తెగుళ్లను అరికట్టడం జరుగుతుందన్నారు . అనంతరం రైతు ప్రసాద్ మాట్లాడుతూ సూపర్ లావా 5 జి వాడడం తో మిరుపతోట వేపుగా పెరిగి గుబురుగా రావడం జరిగిందని మిగతా రైతులు సైతం ఈ మందును వాడడం వలన దిగుబడి పెరిగి అధిక లాభాలను ఆర్జించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైన్ ఆఫీసర్ చందు, శంకర్, చుట్టుపక్కల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మూల రమేష్ జన్మదినోత్సవం



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి డిసెంబర్ 07:** తెలంగాణ రాష్ట్ర విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వ్యక్తిగత కార్యదర్శి మూల రమేష్ జన్మ దినాన్ని పురస్కరించుకొని శనివారం ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గం నుండి ఏ సమస్య చెప్పినా వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించే మంచి మనసు కలిగిన సౌమ్యుడు రమేష్ అని కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్ ఒకటవ వార్డు కౌన్సిలర్ చింతల ఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ రాజు వెంకటేశ్వరరాజు మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్ కూళ్ల నరసింహులు విజయేందర్ రెడ్డి గాదె సోమిరెడ్డి మామిడాల సోమయ్య తుంగ కుమార్ బండి శ్రీను యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ గౌడ్ కంతి మధు శ్రీను నాయక్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీ మహిళ కు తీవ్ర గాయాలు

**సకాలంలో స్పందించిన ట్రాఫిక్ పోలీసులు**



**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి డిసెంబరు 07:** ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో రోడ్డు దాటుతున్న ఓ మహిళ తీవ్ర గాయాల పాలయింది. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కుత్బుల్లాపూర్ ఐడిపిఎల్ జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో చింతల్ కు చెందిన చంద్రకళ( 60) ఐడిపిఎల్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో ఆర్టీసీ బస్సు అతి వేగంగా నిర్లక్ష్యంగా నడపడం తో బాధితురాలిని ఢీకొంది. అయితే అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ దానిని గమనించి ఆమె కాలికి గాయం కావడంతో ప్రధమ చికిత్స చేసి దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించాడు. సకాలంలో స్పందించి ఆసుపత్రికి తీసుకు వచ్చినందుకు వైద్యులు ప్రశంసించి రక్తం కోల్పోకుండా ప్రధమ చికిత్స చేసి కాపాడి నందుకు జీడిమెట్ల ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ అంజయ్య ను సీఐ శ్రీనివాస్ ని డాక్టర్లు బాధితురాలు కుటుంబ సభ్యులు ప్రజలు ప్రశంసించారు. ప్రస్తుతం మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## గుండ్ల పోచంపల్లి లో రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు మృతి





**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి డిసెంబరు 07:** పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి గుండ్ల పోచంపల్లి లో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వాహనం వేగంగా నడపడం తో వెళ్లి విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొన్న ద్విచక్ర వాహనం ప్రమాదంలో కార్తీక్ రెడ్డి(26) అక్కడిక్కడే మృతి చెందాడు. కార్తీక్ రెడ్డి గుండ్ల పోచంపల్లి కి చెందిన వాడని అతను బిజినెస్ చేసుకునేవాడని తెలిపారు. అనిల్ కుమార్ రాజుల పాలెం గుంటూరు జిల్లాలో ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. వయసు (23) అనిల్ అనే యువకుడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనిల్ మృతి చెందాడు. అతి వేగమే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మేము సైతం సంస్థ కొలనుపాక పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ




**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి డిసెంబరు 07:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు కంప్యూటర్ విద్యతో పాటు ఆన్ లైన్ విద్యా విధానంపై అవగాహన పొందేందుకు మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ సెట్ ను ఆ పాఠశాలకు బహుకరణగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కోండ్రాజు వెంకటేశ్వర రాజు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు అనాధ పిల్లలకు అనాధ వృద్ధులకు నిరుపేద కుటుంబాలకు వికలాంగులకు సంబంధించి ఏదైనా సమాచారం మా సంస్థ దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత సహాయ సహకారాలు అందించేందుకు నిరంతరం పాటు పడతామని తెలిపారు. ఏలాంటి లాభాపేక్ష లేకుండా కుల మతాలకతీతంగా మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో సేవా భావం కలిగి ఉన్న సుమారు 21 మంది సభ్యులతో కలిసి సంస్థను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు కూళ్ళ నర్సింహులు ప్రధాన కార్యదర్శి తుంగ కుమార్ కోశాధికారి చిక్క శ్రావణ్ కుమార్ సంస్థ సభ్యులు పేరపు శ్రీశైలం కందడి ప్రకాష్ రెడ్డి మాలోత్ శ్రీను నాయక్ బండి శ్రీనివాస్ గల్మ రాజిరెడ్డి జుకంటి రమేష్ కంతి మధు అంగడి ఆంజనేయులు గొట్టం విజేందర్ రెడ్డి పాఠశాల హెడ్ మాస్టర్ ఆకుల వేణు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## మెట్ పల్లి అయ్యప్పస్వామి ఆలయంలో ఫల పుష్ప నారీ కేళ అభిషేకాలు



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి డిసెంబరు 07:** సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్థానిక మెట్ పల్లి లోని అయ్యప్ప దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్టు కు ఉత్సవ మూర్తికి టిపిసిసి డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావు అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఫల పుష్ప పంచామృత నారీ కేల అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. తదనంతరం అన్నదాన కార్యక్రమంలో సుమారు 600 పైగా భక్తులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అయ్యప్ప దీక్ష గురు స్వాములు మంత్రి అంజయ్య గంగుల వివేక్ దొమ్మాటి ప్రవీణ్ వుజగిరి శ్రీనివాస్ బాశెట్టి హరీష్ పడిగెల నరేందర్ చేపూరి రాము బండారి మారుతి ఆలయ అధ్యక్షుడు కోట బుచ్చి భక్తులు స్వాములు అయ్యప్ప దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు

# పార్టీ అభివృద్ధి కోసం పని చేయండి

**–డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్**



**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి డిసెంబర్ 07:** పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేయాలని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఇటీవల కాంగ్రెస్ జిల్లా పార్టీ ఆన్ లైన్ పద్ధతిలో నిర్వహించిన యువజన విభాగం లో అత్యధిక ఓట్లు సాధించి జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయిల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవుల్లో నియమితులైన యువజన విభాగం నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ నాయక్, మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ బానోత్ నరేష్ వైస్ ప్రెసిడెంట్ జాటోత్ సురేష్ నాయక్ ల ఆధ్వర్యంలో మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఆయనను మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువజన నాయకులను అభినందించారు, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీపై ఎంతో నమ్మకంతో మీకు ఓటు వేశారు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరిని కలుపుకుని పోయి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి చిన్నగూడూరు మండల అధ్యక్షులు మారబోయిన వెంకటేశ్వర్లు,మరిపెడ పట్టణ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్ ,కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెద్ద బోయిన ఐలమల్లు,మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష,మాజీ సర్పంచ్ పానుగోత్ రాం లాల్,మైనార్టీ నాయకులు షేక్ అఫ్జల్, ఎండీ అఫ్సర్, ఎండీ అజీజ్,కారంపూడి ఉపేందర్ దేవర శెట్టి లక్ష్మీనారాయణ భాషిపంగు రవికాంత్,మాజీ సర్పంచ్ కృష్ణ నాయక్,సర్వర్ పాషా,జెసీబీ యాకుబ్ పాషా,లెజెండ్ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్దే తారక మంత్రం

**కాంగ్రెస్ ప్రజా పాలనకు ఏడాది పూర్తి**
**డోర్నకల్ ఎమ్మెల్యే గా రామచంద్రు నాయక్ సక్సెస్**
**అధిష్టానం తో సంబంధాలు కలిసొచ్చిన అంశం**
**ప్రభుత్వ విప్ పదవి తో సముచిత గౌరవం**
**వెల్లువలా నిధులు....మొదలైన అభివృద్ధి పనులు**
**వెంట నడచిన కార్యకర్తలకు గౌరవ స్థానం**





**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి డిసెంబర్ 07** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దిగ్విజయంగా తొలి ఏడాది పూర్తి చేసుకుంది, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 వందల లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు 18 వేల రూపాయల కోట్లతో రైతు ఋణ మాఫీ, సన్న రకాల వడ్లకు క్వింటాలుకు ఐదు వందల రూపాయల బోనస్ వంటి పథకాల అమలుతో పాటు గత 10 యేళ్ళుగా ఉద్యోగ నియామాకాల కోసం కళ్ళు కాయలు కాసే లా ఎదురు చూసిన నిరుద్యోగులు కల సాకారం అయ్యేలా 60 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టింది.

### నిధుల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వ బాటలోనే డోర్నకల్ నియోజక వర్గం లో వివిధ రకాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే జాటోత్ రామా చంద్రు నాయక్ తన పూర్వ పరిచయాలను ఆసరా చేసుకుని నూటయాభై కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే గా గెలిచింది మొదలు అధిష్టానం తో సంబంధాలు మెరుగు పరుచుకొని ప్రభుత్వ విప్ పదవి పొంది ప్రభుత్వ వ్యవహారాల్లో కీలక పాత్ర వహిస్తూ, నియోజక వర్గ అభివృద్ధి కోసం ఆయన పడుతున్న తపన ప్రజా హృదయాలకు తాకుతూనే వుంది. ఈ క్రమంలో నియోజక వర్గంలోని డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీ లకు చెరో 35 కోట్ల చొప్పున 70 కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి, రాబోయే 30 యేండ్ల వరకు పెరిగే జనాభా నీటి అవసరాలు తీర్చడానికి ఒక్కో మున్సిపాలిటీ లో 25 కోట్లతో భారీ త్రాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు.మరో 10 కోట్ల తో సీసీ రోడ్లు,మురుగు కాలువల నిర్మాణానికి వినియోగిస్తున్నట్టు సమాచారం.నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన మరిపెడ పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ లో సీసీ నిర్మాణం తన ప్రత్యేక నిధులతో చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాడు,ఇప్పుడు తెచ్చిన 150 కోట్ల తో పాటు త్వరలోనే మరో 2 వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాను అని ఎమ్మెల్యే పలు సమావేశాల్లో ప్రకటించడం నియోజకవర్గ ప్రజలను, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సంతోషానికి గురి చేస్తుంది.

### ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కేటాయింపు డోర్నకల్ కు రావడంలో ఎమ్మెల్యే కృషి విశేషంగా వుంది గిరిజనులు ఎక్కువగా వున్న ఈ ప్రాంతంలో ఈ స్కూల్ నిర్మాణం కేజీ నుండి పీజీ వరకు పేదలకు విద్య అందిస్తూ ఉపయుక్తంగా నిలబడుతుంది.

### నామినేటెడ్ పోస్టులు

నామినేటెడ్ పోస్టుల్లో కూడా ఎమ్మెల్యే నూతన పంథాలో పయనిస్తున్నాడు, కేసముద్రం, మహబూబాబాద్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్లలో చైర్మన్, వైస్ చైర్మన్ వంటి కీలక పదవుల్లో దశాబ్ద కాలంగా తన వెంట నడిచిన కార్యకర్తలకే ప్రాధాన్యతనిచ్చి యువత ధైర్యంగా రాజకీయాల్లోకి రావొచ్చు అనే భరోసా కల్పించాడు.

### కష్టపడే తత్వం

ఉదయం 8:30 గంటల నుండి రాత్రి 11:30 వరకు డోర్నకల్ మండలం నుండి దంతాల పల్లి మండలం వరకు... ఎన్నో అభివృద్ధి పనులు... .ఎన్నో నూతన జీపీ కార్యాలయాలు, అంగన్వాడీ సెంటర్లు, ఇందిరమ్మ స్త్రీ శక్తి క్యాంటీన్లు, మరెన్నో ధాన్యం కొనుగోలు సెంటర్లు ... ఎన్నెన్నో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు... కల్యాణలక్ష్మి, సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమాలతో ఏక ధాటిగా విశ్రాంతి లేకుండా నియోజకవర్గం కలియ తిరిగినా గాని అలసిపోని తత్వం.. ఆత్మవిశ్వాసంతో ,నిండు సంకల్పంతో వేసిన మొదటి అడుగు నుండి అన్ని కార్యక్రమాలు ముగించుకొని వెళ్లే చివరి అడుగు వరకు ఒకే పట్టుదల... డోర్నకల్ అభివృద్దే ధ్యేయంగా ఈ నియోజకవర్గ ప్రజల సౌఖ్యమే నినాదంగా సాగుతున్న ఈ ప్రజా పాలనలో, డోర్నకల్ నియోజకవర్గ గడ్డమీద సక్సెస్ ఫుల్ ఎమ్మెల్యేగా పనితీరు ఇలాగే కొనసాగాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# మలక్ పేట లోని బధిరుల హాస్టల్ లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన మంత్రి సీతక్క





**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి డిసెంబరు 07:** ప్రజా పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దివ్యాంగులతో సమయాన్ని వెచ్చించడం ఆనందంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవ లోపాలు ఉన్నంత మాత్రాన దివ్యాంగులు అనడం సరికాదు. వారు దివ్యాంగులు కాదు.. విభిన్న ప్రతిభావంతులు సరూర్ నగర్, మాసబ్ ట్యాంక్ లోని అంద హాస్టల్లో ఉండి చదువుకున్న వాళ్లు 16 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తిగా ఇతర దివ్యాంగులు ఏదో ఒక రంగంలో ముందంజలో నిలవాలని దివ్యాంగుల సమస్యలు విని వాటిని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు బధిరులకు తగిన సంఖ్యలో ఇంటర్ కాలేజీలను త్వరలో ప్రారంభిస్తామని ఆఫీసుల చుట్టూ తిరగకుండా చేయూత పెన్షన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసే లాగా చర్యలు తీసుకుంటామని ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దివ్యాంగులతో గడపడం ఆనందంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు.

# అయ్యా ఏసీపీ ప్రతాప్
# ఈ భారీ అక్రమ నిర్మాణంలో మీ వాటా ఎంత..?

- అయ్యా ప్రతాప్ నీ ప్రతాపమంతా పేదవారి పైనేనా బడా బాబుల జోలికి వెళ్ళరా..?
- బడా బాబుల అక్రమ నిర్మాణాలకు ఏసీపీ ప్రతాప్ అండదండలు
- ఏసీపీకి మామూళ్లు అందితే కూల్చరు, అందకపోతే కూల్చుతారనే విమర్శలు
- నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఏసిపి ప్రతాప్..?





**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి డిసెంబరు 07:** ఆయన ప్రతాపం అంతా పేదవారి ఇల్ల మీదనే చూపిస్తాడు. బడా బాబుల బడా బడా అక్రమ నిర్మాణాల జోలికి మాత్రం వెళ్లడు.

వివరాల్లోకి వెళితే ఎసిపి ప్రతాప్ అండదండలతో ఎల్బీనగర్ సర్కిల్ జాంగిర్ నగర్ కాలనీలో భారీ అక్రమ నిర్మాణం అనుమతి లేని సెల్లార్, అలాగే అనుమతి జి ప్లస్ టు ఉంటే నాలుగు ఐదు అంతస్తులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణ దారుడు. ప్రభుత్వం నుండి లక్షల్లో జీతాలు తీసుకుంటూ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి అక్రమ నిర్మాణ దారులకు ఏసిపి సహకరిస్తున్నారంటూ, ఎసీపీ ని ప్రసన్నం చేసుకుంటే చాలు అనుమతులే అవసరం లేదు అన్న చందంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు ఇలాంటి అక్రమ నిర్మాణాల వద్ద ఎసిపితో పాటు కిందిస్థాయి సిబ్బంది కూడా చాలా గట్టిగానే దండుకున్నారేమో అందుకే ఆ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారనే అనుమానం కూడా వ్యక్తం అవుతుందంటున్నారు స్థానికులు. టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్లు అందితే అక్రమ నిర్మాణాలను కూల్చరని, మామూళ్లు అందకపోతే వెంటనే కూల్చుతారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఎసీపీ వద్దకు ఫిర్యాదులు ఎన్ని ఇచ్చినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ఇకనైనా ఎసీపీ ప్రతాప్ అక్రమ నిర్మాణాలకు సహకరించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# ఏడాది కాంగ్రెస్ పాలనలో
# మార్పు రాలేదు.. బతుకులు మారలేదు..!







- కొత్త రేషన్ కార్డు ఇచ్చే దమ్ము ధైర్యం లేని చేతగాని దద్దమ్మ ప్రభుత్వం...
- బిఆర్ఎస్ లెక్కనే కాంగ్రెస్ పాలన... జూట మాటలతో ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారు..?
- దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై నిలదీస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వానివి 6 అబద్ధాలు 66 మోసాలు
- కాంగ్రెస్ గ్యారెంటీ ల గారడి, అబద్దాల హామీలను ప్రజలకు వివరించడానికే బిజెపి పోరుబాట...
- టవర్ సర్కిల్ సభలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు....

**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు డిసెంబరు 07**

తెలంగాణ రాష్ట్రంలో మారింది పాలకులే నని, గత బిఆర్ఎస్ అడుగుజాడల్లో కాంగ్రెస్ నడుస్తుందని , పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దొందు దొందే నని, రాష్ట్ర పాలనలో మార్పు రాలేదని, ప్రజల బతుకులు మారలేదని, మాయ మాటలు మోసపూరిత వాగ్దానాలతో హామీలతో ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.

బిజెపి పోరుబాట కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం శాతవాహన యూనివర్సిటీ నుండి టవర్ సర్కిల్ వరకు భారీ వాహన ర్యాలీ చేపట్టి సభ నిర్వహించారు. ఇట్టి ర్యాలీ, సభకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం అడ్డగోలు హామీలు, గ్యారెంటీ లను ఇచ్చి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజల తరపున బిజెపి పోరుబాట చేపట్టిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతుందని, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ లను అమలు చేస్తామని ఏ ఒక్క గ్యారెంటీ నైనా సక్రమంగా అమలు చేయలేకపోయిందన్నారు. కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్లదీసింది తప్ప ఏ ఒక్క వర్గానికి మేలు చేయలేకపోయిందన్నారు . రైతు భరోసా రూ 15 వే లు, రైతు కూలీలకు 12 వేలు, మాయ మాటలే తప్ప ఆచరణలో లేదన్నారు. రుణ మాఫీ అరకొరే నని, వరి బోనస్ పై బోగస్ మాటలు చెబుతున్నారని విమర్శించారు. మహాలక్ష్మి అని మహిళలను మోసం చేశారన్నారు. ఆడబిడ్డలకు ప్రతినెల ఇస్తామన్న రూ.2500 ను అటకెక్కించారని , రూ.500 సిలిండర్ రాయితీ కార్యక్రమం అరకొర గానే కొనసాగించిందన్నారు . పేదలకు సొంతిల్లు కలగానే మిగిలిపోయిందని, ఒక డబల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వలేదని, ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల సహాయం అందించలేదని విమర్శించారు. యువ వికాసం పథకం ద్వారా అందిస్తామన్న ఐదు లక్షల విద్యా భరోసా కార్డు, మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఉత్తిత్తి హామీలు గా మారాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ లు , వాగ్దానాలు హామీలు కోకొల్లలు ఉన్నాయని, అందులో ఏ ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చలేకపోయిందన్నారు. ఒకప్పుడు రెండు వేల పింఛన్ వచ్చు డే గగనం అనుకుంటే , రూ.4,000 పింఛన్ ఇస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు.. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు, 66



మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. జూట మాటలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజం అని, అందుకే మోసాలను నిలదీయడానికి బిజెపి పోరాటం చేస్తుందన్నారు.

ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి, కన్న కృష్ణ, ఎర్రబెల్లి సంపత్ రావు , కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, టౌన్ 1,2 కన్వీనర్లు కోలగని శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, కన్నబోయిన ఓదెలు, మండల , జోన్ అధ్యక్షులు కంచె శేఖర్, కడార్ల రతన్, అవదుర్తి శ్రీనివాస్, జాడి బాల్ రెడ్డి, పురం హరి, తనకు సాయి, కార్పొరేటర్లు వంగల పవన్, బండ రమణ, నాగసముద్రం ప్రవీణ్, కొలగని శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, రాజు , జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, రాజు లడ్డు ముందడ మాసం గణేష్, శివానందం తోపాటు కరీంనగర్ అసెంబ్లీ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారానికి మహారాష్ట్ర ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరాకరణ

**ముంబై :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరుగనుంది. కానీ ప్రమాణ స్వీకారం చేయడానికి ప్రతిపక్ష మహావికాస్ అఘాడి కూటమికి చెందిన ఎమ్మెల్యేలు నిరాకరించారు. ఎన్నికల్లో మోసం జరిగిందని.. ఈవిఎం ఓటింగ్ మెషీన్లు టాంపిరింగ్ చేసి మహాయుతి పార్టీలు మోసపూరితంగా విజయం సాధించారని ఆరోపణలు చేస్తూ.. తాము ఎన్నికల్లో నిరసనగా ప్రమాణా స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని ఉద్ధవ్ శివసేన పార్టీకి చెందిన ఆదిత్య ఠాక్రే తెలిపారు.“ఈ రోజు మా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయరు. మాకు ఈవిఎంలపై అనుమానాలున్నాయి. ఎన్నికల్లో జరిగిన మోసానికి నిరసనగా మేము ఈ రోజు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థ హత్య చేస్తున్నారు.” అని ఆదిత్య ఠాక్రే అన్నారు.మహారాష్ట్రలో శనివారం నుంచి మూడు రోజుల పాటు కొత్తగా ఏర్పడిన అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశంలో మొత్తం 288 మంది ఎమ్మెల్యేలు పాల్గొంటారు. ఇప్పటికే ప్రొటెమ్ స్పీకర్ గా ఎమ్మెల్యే కాళిదాస్ కొలంబకర్ ని నియమించారు. మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ శుక్రవారం డిసెంబర్ 6, 2024న బిజేపీ సీనియర్ ఎమ్మెల్యే కొలంబకాని ప్రొటెమ్ స్పీకర్ నియమించారు. శనివారం ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ రాధాకృష్ణన్ ప్రసంగంతో ప్రారంభమవుతాయి. అసెంబ్లీ కొత్త స్పీకర్, కొత్త ప్రభుత్వం మెజారిటీ విశ్వాస పరీక్ష కూడా జరుగుతుంది. కొత్త స్పీకర్ చేత ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకార కార్యక్రమం కూడా జరుగుతుంది.అయితే ఈ సమావేశాలను ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమిలోని కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన పార్టీలక చెందిన ఎమ్మెల్యేలందరూ బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. “ఈ ఎన్నికల ఫలితాలు అనుమాస్పదంగా ఉన్నాయి. అసలు ఈ ఎన్నికల ప్రక్రియపైనే చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ప్రజలు సంతోషంగా లేదరు. ఏదో తప్పు జరిగింది.” అని కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ్ వాడెట్టివార్ ఆగ్రహంగా అన్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి అనూహ్య విజయం సాధించింది. కూటమిలోని బిజేపీ, షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ.. ఈ మూడు పార్టీలు కూడా భారీ మెజారిటీతో గెలుపొందాయి. నవంబర్ 20న జరిగిన ఎన్నికల్లో మొత్తం 288 అసెంబ్లీ సీట్లకు గాను మహాయుతి కూటమి 230 సీట్లపై విజయం సాధించింది.

## ఈ నెల 9 న పెద్ద పాపయ్యపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం






**షణ్ముఖ వెలుగు హుజూరాబాద్ రూరల్ ప్రతినిధి డిసెంబర్ 07:** జయన్న ఫౌండేషన్ అధినేత గుడిపాటి జైపాల్ రెడ్డి గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు ఉచితంగా నేత్ర సమస్యలను తొలగించాలని ఉద్దేశ్యంతో డిసెంబర్ నెల 9 వ తేదీ సోమవారం హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్య పల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జయన్న ఫౌండేషన్ అధినేత గుడిపాటి జైపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పెద్ద పాపయ్య పల్లి గ్రామంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వారు సైతం నేత్ర వైద్య శిబిరంలో ఉచిత చికిత్సలు చేయించుకోవచ్చని, హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి హైదరాబాద్ లో శస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ‘అమిత్ షా ఎన్నికల్లో బిజీగా ఉన్నారు’..

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో నేరాలు పెరుగడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల్లో బిజీగా ఉన్నారంటూ మండిపడ్డారు. గ్యాంగ్‌స్టర్ల నియంత్రణలో ఢిల్లీ ఉందని ఆరోపించారు. శనివారం దేశ రాజధానిలో వేర్వేరుగా రెండు హత్యలు జరుగడంపై కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ‘ఢిల్లీలో శాంతిభద్రతల బాధ్యత అమిత్ షాపై ఉంది. కానీ ఆయన ఎన్నికలతో బిజీగా ఉన్నారు. గ్యాంగ్‌స్టర్ల నియంత్రణలో ఢిల్లీ ఉంది. షూటర్లను అరెస్టు చేస్తున్నప్పటికీ వెనుక ఉన్న సూత్రధారులు ఇంకా పరారీలో ఉన్నారు’ అని మీడియాతో అన్నారు. కాగా, కేంద్ర హోంశాఖ పరిధిలో పోలీసులు ఉన్న ఢిల్లీలో శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా ఉన్నాయని అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. నేరస్థులకు భయంలేకుండా పోయిందని అన్నారు. బెదిరింపు ఫోన్ కాల్స్ కారణంగా పలువురు వ్యాపారులు ఢిల్లీని వీడి పోతున్నారని తెలిపారు. ‘ఢిల్లీలో మహిళలకు భద్రత లేదు. అత్యాచారాలు, హత్య కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఢిల్లీ ప్రజలను రక్షించడంలో ఢిల్లీ పోలీసులు విఫలమవుతున్నారు’ అని కేజ్రీవాల్ ఆరోపించారు.

## మోదీని చంపుతామంటూ బెదిరింపు మెసేజ్

**ముంబై:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చంపుతామంటూ ముం బై పోలీసులకు శనివారంనాడు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్టు గుర్తించామని, నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాన్ని వెంటనే అక్కడికి పంపామని అధికారులు తెలిపారు. అధికారుల కథనం ప్రకారం, ముంబై ట్రాఫిక్ పోలీసు హెల్ప్‌లైన్‌కు శనివారం ఉదయం వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ప్రధాని మోదీని టార్గెట్‌గా చేసుకుని ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు బాంబు పేలుడుకు పథకం వేసినట్టు ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో అప్రమత్తమైన అధికారులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని అజ్మీర్‌కు పంపారు. మెసేజ్ పంపిన వ్యక్తి మానసిక స్థిమితం కోల్పోవడం కానీ, మద్యం తాగిన మైకంలో కానీ ఉండవచ్చని అనుమానిస్తున్నారు. భారతీయ న్యాయసంహితలోని సంబధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. ముంబై పోలీస్ హెల్ప్‌లైన్‌కు బాంబు బెదిరింపు మెసేజ్‌లు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇలాంటి బెదిరింపు మెసేజ్‌లు రావడం, అవి ఉత్తవేనని తేలడం జరిగింది.

**సల్మాన్‌కు బెదిరింపులు**

కాగా, బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌ను చంపుతామంటూ 10 రోజుల క్రితం ముంబై ట్రాఫిక్ పోలీసులకు రెండు బెదిరింపు మెసేజ్‌లు వచ్చాయి. సల్మాన్ బతికుండాలంటే ఆయన రాజస్థాన్‌లోని బిష్ణోయ్ టెంపుల్‌కు వెళ్లి బిష్ణోయ్ కమ్యూనిటీకి క్షమాపణ చెప్పడం కానీ, రూ.5 కోట్లు చెల్లించడం కానీ చేయాలనే హెచ్చరిక సందేశం అందులో ఉంది. సల్మాన్ ఆ పని చేయకుంటే ఆయనను అంతమొందిస్తామని, బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికీ సజీవంగానే ఉందని కూడా తెలిపింది.

## ఎంవీఏకు షాక్.. కూటమి నుంచి వైదొలగిన సమాజ్‌వాదీ పార్టీ

**ముంబై:** మహారాష్ట్రలో ప్రతిపక్షమైన మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమికి సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) షాక్ ఇచ్చింది. ఆ కూటమి నుంచి వైదొలగాలని నిర్ణయించింది. ఎస్పీ ఎమ్మెల్యే అబూ అజ్మీ శనివారం ఈ విషయాన్ని ప్రకటించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యూబీటీ) ఓడిన తర్వాత ‘హిందుత్వ ఎజెండా’ను అవలంబించిందని ఆయన ఆరోపించారు. కాగా, సీట్ షేరింగ్ సమయంలో, ఆ తర్వాత ప్రచారంలో కూడా ఎంవీఏలో సమన్వయం లేదని మహారాష్ట్ర ఎస్పీ అధ్యక్షుడైన అబూ అజ్మీ విమర్శించారు. ‘అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అంతర్గత సమావేశంలో హిందుత్వ ఎజెండాను దూకుడుగా కొనసాగించాలని తన నాయకులు, పార్టీ కార్యకర్తలకు చెప్పారు. డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేతకు అనుకూలంగా ఆ పార్టీ సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్ట్ చేసింది. దీన్ని మేం సహించబోం. కాబట్టి ఎంవీఏతో కొనసాగకూడదని నిర్ణయించుకున్నాం’ అని అన్నారు.

మరోవైపు మహారాష్ట్ర అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎంవీఏ బహిష్కరించింది. అయితే ఎస్పీ ఎమ్మెల్యేలు అబూ అసిమ్ అజ్మీ, రైస్ షేక్ ఈ పిలుపును ధిక్కరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు.

## రక్షణ శాఖ సహాయ మంత్రికి బెదిరింపు.. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ మొబైల్ ఫోన్‌కు బెదిరింపు మెసేజ్ వచ్చింది. ఆగంతకులు రూ.50 లక్షలు డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి సంజయ్ సేథ్ దీని గురించి ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం రూ. 50 లక్షల దోపిడీకి సంబంధించిన బెదిరింపు సందేశం వచ్చిందని ఆయన ధృవీకరించారు. ఆ వెంటనే ఢిల్లీ సీనియర్ పోలీస్ అధికారిని కలిసి దీని గురించి చెప్పానన్నారు. డీసీపీ, ఇతర సీనియర్ పోలీస్ అధికారులు ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నారని శనివారం వెల్లడించారు. అలాగే జార?ండ్ డీజీపీ అనురాగ్ గుప్తాతో కూడా స్వయంగా మాట్లాడి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కాగా, ఇలాంటి బెదిరింపులపై వీలైనంత త్వరగా స్పందించాలని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. ‘ఈ విషయాన్ని రిపోర్ట్ చేయడం నా బాధ్యత. నేను అలా చేశా. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వం నుంచి ప్రేరణ పొందా. నా పనిపై, ప్రాంతాలను సందర్శించడం, ప్రజలను కలవడంపై దృష్టి పెడుతున్నా. ఎప్పటిలాగే పోలీసులు తమ పనిని సమర్థవంతంగా చేస్తున్నారు’ అని అన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com